అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 18 అక్టోబర్ 2022 పేజీలు : 04

# 2024 ఎన్నికల్లో బరిలో నేనుంటా..!

- కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే పాపమా..
- దుష్ట శక్తుల నుంచి కళ్యాణదుర్గాన్ని కాపాడుతా
- ఎన్నికల బరిలో దిగి నా సత్తా ఏమిటో చూపిస్తా..
- ఆరు నెలల్లో ఏ పార్టీ తరుపున పోటీ చేసేది ప్రకటిస్తా..
- పారిశ్రామిక వేత్త బెస్తర పల్లి జికె.కృష్ణమూర్తి వెల్లడి



**అనంతపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దిగుతానని, ఎన్నికల్లో నా సత్తా ఏమిటో చూపిస్తానని ప్రముఖ పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి జికె.కృష్ణమూర్తి వెల్లడించారు. దుష్ట శక్తుల నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని కాపాడుతానని మరింత సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వస్తున్నానని ఎన్ని అడ్డంకులు సృష్టించినా సేవా కార్యక్రమాలు ఆపనని ఆరు నెలల్లో ఏ పార్టీ తరుపున పోటీ చేసేది ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. సోమవారం కళ్యాణదుర్గంలోని అక్కమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం బెస్తరపల్లి కిష్ణమూర్తి విలేకర్లతో మాట్లాడారు. తాను పుట్టిన ఈ ప్రాంతానికి నేను సంపాదించిన దాంట్లో కొంతైనా సేవ చేయాలనుకున్నా, అయితే అదే నేరంగా ఉందని ప్రజలకు సేవ చేయడమే నేరమా అని ఆయన ప్రశ్నించారు. నేను చేసే ప్రతి సేవా కార్యక్రమంపై ఎందుకింత కక్ష అంటూ కృష్ణమూర్తి మండి పడ్డాడు. నా సొమ్ముతో ప్రజలకు సేవ చేస్తున్నానే తప్పా ఎవరినీ దోచుకోలేదన్నారు. కష్టాల్లో ఉన్న వారిని గుర్తించి వారిని ఆదుకోవడమే పాపమా అని ఆయన ప్రశ్నించారు. ప్లెక్సీలు తొలగించి అభిమానులను బెదిరించిన మాత్రాన నేను వెనక్కి తగ్గే ప్రశ్న లేదన్నారు. నా సేవా కార్యక్రమాలు నిలుపుదల చేస్తే ఎవరికి లాభం, ఎవరికి నష్టం అని ఆయన సూటిగా ప్రశ్నించారు. నా సామాజిక సేవా కార్యక్రమాలు అడ్డు కోవడం ద్వారా, ప్రజలకు నష్టం జరుగుతుందన్నది గుర్తు పెట్టుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నన్ను ఇబ్బంది పెడితే ప్రజలకు పెట్టినట్లే. కానీ నేను ఎవరికీ భయపడనని, ఇకపై రాజకీయాల్లోనే ఉంటానని, 2024 ఎన్నికల్లో బరిలో దిగుతానని ఆయన ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేసి ప్రజలకు మరింత సేవ చేస్తానని, మీరు ఎంత అడ్డుకుంటే నేనంత ఎత్తుకు ఎదుగుతానన్నారు. ఎన్ని అడ్డంకులు సష్టించినా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటానని, ఆరు నెలల్లో ఏ పార్టీ తరుపున పోటీ చేసేది ప్రకటిస్తానన్నారు.

### ఆక్సీజన్ ప్లాంట్ యంత్రాలు కనిపించక పోవడంపై జికె ఏమన్నారంటే..!

కరోనా రక్కసిలో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు చూశాం. నేను కూడా కరోనా భారిన పడి కార్పోరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాను. దాని కోసం లక్షలు ఖర్చు పెట్టాను. అప్పుడే నేను పుట్టిన ప్రాంతంలో కరోనా రక్కసి ద్వారా ప్రాణాలు పోతున్నాయని, మిత్రుల ద్వారా తెలుసుకుని దాదాపు 35 లక్షలు వెచ్చించి ఆక్సీజన్ సిలెండర్ కాకుండా జనరేట్ ప్లాంట్ అంటే ఆక్సీజన్ ఉత్పత్తి కేంద్రాన్ని కళ్యాణ దుర్గంప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చానన్నారు. అయితే ఆసుపత్రిలో ఆ ఉత్పత్తి కేంద్రంలో యంత్రాలు మాయం చేశారని, ప్రజలకు మంచి చేయాలని చూస్తే ఆటంకం సృష్టించడం కరెక్ట్ అన్నది ప్రజలు ఆలోచించాలన్నారు. మిస్ అయిన యంత్రాలను విదేశాల నుంచి తెప్పించి ఓ మంచి రోజు ప్రజల సమక్షంలో ప్రారంభిస్తానన్నారు.

### ప్లెక్సీలు తీసివేత.. కేక్ కట్ చేయకుండా అడ్డుకోవడంపై జీకె ఏమన్నారంటూ.. !

నేను చేస్తున్న సేవలను గుర్తించి నా అభిమానులు ప్లెక్సీలు వేస్తే తీసేయాలని బెదిరించారని పారి శ్రామిక వేత్త బెస్తరపల్లి జికె.కృష్ణమూర్తి వెల్లడించారు. మున్సిపాలిటీలో ప్లెక్సీల ఏర్పాటు కోసం రుసుము కూడా చెల్లించామని, అయినప్పటికీ ప్లెక్సీలు తొలగించారు. నా పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేయకుండా బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. వీటన్నింటిపై కలత చెందాను. అందుకోసమే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నా. ఆరు నెలల్లో ఏ పార్టీ తరుపున పోటీ చేసేది ప్రకటించి 2024 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి బరిలో దిగుతానని, ఈ విషయంలో తగ్గేదే లేదని ఆయన స్పష్టం చేశారు.

# వ్యవసాయాన్ని పండుగ చేశాం

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్



చెక్కును అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం పండుగలా మారిందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కుందుర్పి మండలానికి చెందిన బెస్తర పల్లి వరసగా నాలుగో ఏడాది అందిస్తున్న రైతు భరోసా రెండవ విడత నగదు బదిలీ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిసిసిబి చైర్‌పర్సన్ లిఖిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోమంత్రి మాట్లాడుతూ.. మనసున్న నాయకుడి పరిపాలనలో కరువు జిల్లా అయిన అనంతపై దేవుడు కరుణ చూపి వర్షాలు కురిసేలా చేస్తున్నారన్నారు. ఇరవై ఐదేళ్ల కాలంలో ఎప్పుడూ చూడని నీళ్ల జిల్లాలో చూస్తున్నామన్నారు. 207 మంది ఆర్ఎఫ్ఆర్ పట్టా రైతులను కలుపుకుని మొత్తం 2,83,063 మంది రైతులకు సంబంధించి రూ.113.23 కోట్ల చెక్కును సమావేశంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు.

### రైతు భరోసా కేంద్రం ప్రారంభం

బెస్తరపల్లి గ్రామంలో రూ.21.80 లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి, కలెక్టర్‌ప్రారంభించారు. ఓ లబ్దిదారురాలుకి యూరియా పంపిణీ చేసి లాంఛనంగా ఆర్‌బికె కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రం వద్దే రైతులకు వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగులమందులు, విత్తన కొనుగోలు వంటి సేవలన్ని అందిస్తున్నా మన్నారు. ప్రతి రైతు ఈ క్రాప్, ఈకెవైసి తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలన్నారు. క్రితం సారి ఒక్క అనంతపురం జిల్లాకే పంట నష్ట పరిహారంగా ప్రభుత్వం రూ.600 కోట్లు చెల్లించిందని, ఏ ఒక్క రైతు ఈ క్రాప్, ఈకెవైసి చేయించుకోని కారణంగా పంటల భీమా, ఇన్‌పుట్ సబ్సిడి పొందని పరిస్థితి రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వ్యవసాయ శాఖ జెడి చంద్రనాయక్, ఆర్డిఓ నిశాంత్‌రెడ్డి, జడ్పిటిసి నాగయ్యస్వామి, ఎంపిపి కమల నాగరాజు, సర్పంచు మమత, ఎంపిటిసి కవిత, ఎంపిడిఓ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



బికెఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

# పేరుకే రెండవ ముంబాయి..

# బస్సులన్నీ బైపాసే

- కొత్తబస్టాండ్ వరకూ బస్సులు నడపండి..
- ఆర్థికంగా నష్టపోతున్న పామిడిని ఆదుకోండి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎప్పుడూ రద్దీగా ఉండే అంబేద్కర్ సర్కిల్ బస్సులు రాకపోవటంతో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

**పామిడి, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

ఇదేదో మారుమూల అనుకుంటున్నారా.. కాదండి గ్రామపంచాయతీ ఈ ప్రాంతానికి ఓ ప్రత్యేకత ఉంది.. ఈ ప్రాంతం పేరు చెబితే ఓ పట్టాన గుర్తు పట్టరు కానీ రెండవ ముంబాయి అంటే మాత్రం టక్కున చెబుతారు. భారతదేశ వస్త్ర వ్యాపార రంగంలో ఖ్యాతిని ఘడించిన అతిపెద్ద నగరం ముంబాయి కాగా అంతటి పేరు ప్రఖ్యాతలు గాంచిన పట్టణమే పామిడి.. ఇక్కడన్నీ ఎక్కువే బస్సుల రాకపోకలు మాత్రం తక్కువేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేమి విచిత్రమో ప్రజలు, ప్రయాణికులు ఏమి పాపం చేశారో ఆర్టీసి బస్సులన్నీ బైపాసు గుండానే వెళ్తున్నాయి. వ్యాపార రంగంలో ముంబాయి అంతటి మహానగరాన్ని తలదన్నే విధంగా పామిడిలో రూ.కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్న ఇక్కడికి వస్త్రాలను కొనుగోలు చేయానికి కొందరు.. దర్జీ వృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం కొనసాగిస్తూ క్లాత్‌ను తీసుకెళ్ళి వస్త్రాలను తయారుచేసి తీసుకొస్తున్న మరికొందరు వేలాదిమంది రాకపోకలు సాగిస్తుండటం దార్వ అనునిత్యం రద్దీగా ఉంటుంది. ఎవరైనా ప్రయాణాలను కొనసాగించాలంటే బైపాస్‌కు వెళ్ళటం తప్పనిసరి ఎందుకంటే ఇక్కడ బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవటమే ప్రధాన కారణం. ఎలాగోలా తమ గమ్యాలకు చేరుకోవాలన్న ఉద్దేశ్యంతో కొందరు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండగా మరికొందరు విధిలేక బైపాస్‌కెళ్ళి ప్రయాణాలను కొనసాగిస్తున్న దుస్థితి నెలకొంది. పట్టణంలో అర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు బస్టాండ్‌లో బస్సులను నిలుపటానికి చర్యలు చేపట్టిన దాఖాలాలు లేకపోగా బస్టాండ్ స్థలం అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎంపిఆర్ డ్యాం వరదనీటితో నిండిపోవటం పెన్నానదికి పెద్దఎత్తున నీటిని విడుదల చేయటం నదీ పరివాహక ప్రాంతం ఉధృతంగా ప్రవహించటం కారణంగా పామిడి-కల్లూరు మద్యనున్న పెన్నానది రోడ్డు పూర్తిగా ద్వంమైంది. రోడ్డుపై నీరు ఉదృతంగా ప్రవహించటంతో రోడ్డు కోతకు గురై కొట్టుకుపోవటం మూడో కాలువ వద్ద రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటం గత రెన్నెళ్ళుగా ఆర్టీసీ బస్సులు సైతం పామిడి జాతీయ రహదారి గుండా రాకపోకలను కొనసాగిస్తున్నాయి. ఫలితంగా ప్రయాణికులు, వ్యాపారస్థులు అనేక ఇబ్బందులకు గురవుతుండగా నిత్యం రద్దీగా ఉంటున్న పామిడి పట్టణం నిర్మానుశ్యంగా వస్త్ర వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలంటే వ్యాపారులు, ప్రజలు, ప్రయాణికుల సౌకర్యంగా ఆర్టీసీ బస్సులు ఇక్కడ రాకపోకలు సాగించటం ద్వార మాత్రమే సాధ్యమవుతుంది. ప్రభుత్వం నుండి నిధులను రాబట్టి పూర్తిగా ద్వంమైన పెన్నానది రోడ్డును నిర్మించాలని అప్పటివరకూ బైపాస్ గుండా రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ బస్సులను కొత్తబస్టాండ్ వరకూ నడుపుతూ బస్టాండ్ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ ఆర్థికంగా దెబ్బతింటున్న పామిడిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ రాజకీయం నడుస్తుంది. అధికార, ప్రతిపక్ష, ఇతరత్ర పార్టీలు మరెక్కడా లేనన్ని కుల, ప్రజాసంఘాలు ఉన్నాయని అవన్నీ ప్రజల సమస్యలు, పట్టణ ప్రగతిని మరిచిపోయి స్వప్రయోజనాలను కాపాడుకోవటానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయన్న ఆరోపణలు బలంగానే వినిపిస్తున్నాయి. అభివృద్దే లక్ష్యమని ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తామని ప్రకటిస్తున్నాయే కానీ ఆర్టీసి బస్సులు బైపాస్ గుండా ఎందుకెళ్తున్నాయని పట్టణంలోని బస్టాండ్ వరకూ ఎందుకు రావటం లేదో తెలుపాలని హైదరాబాద్ నుండి బెంగుళూరుకు రాకపోకలు సాగిస్తున్న బస్సుల డిపోల మేనేజర్లను సంప్రదించి ఒక్కసారైనా ప్రశ్నించిన దాఖాలాలు లేకపోవటమే ఇందుకు నిదర్శనమని పలువురి వాధన. వస్త్ర వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలంటే వ్యాపారులు, ప్రయాణికుల సౌకర్యంగా ఆర్టీసి బస్సులు ఇక్కడ రాకపోకలు సాగించటం ద్వార మాత్రమే సాధ్యమవుతుందని ప్రజాప్రతినిధులు రాజకీయ, కుల, ప్రజాసంఘాల నాయకులు ఆయా డిపోల మేనేజర్లతో చర్చించి పెన్నానది వంతెనె నిర్మాణం జరిగేవరకూ పామిడి బస్టాండ్‌కు నిరంతరం బస్సుల రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుని నిరుపయోగంగా మారిన బస్టాండ్ అభ్యున్నతికి కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# వైసిపి సానుభూతిపరులపై టిడిపి దాడి











దాడిలో గాయపడిన వైసిపి సానుభూతిపరులు వినయ్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సత్య నారాయణరెడ్డి, రామిరెడ్డి

- ఒకే కుటుంబానికి చెందిన 5 మందికి తీవ్రగాయాలు
- దాడిలో 11 మంది టిడిపి నాయకులు
- గ్రామంలో పోలీసులు అలర్ట్
- భయాందోళనలో గ్రామస్తులు

**పెద్దపప్పూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

మండలంలోని జె.సి సోదరుల స్వగ్రామం జూటూరులో ఫ్యాక్షన్ పడగ విప్పింది. సోమవారం పొలాలకు వెళ్లే దారి విషయమై గ్రామానికి చెందిన వైసిపి సానుభూతిపరులను ఇదే గ్రామానికి చెందిన నారాయణరెడ్డితో పాటు 11 మంది టిడిపి నాయకులు కొడవళ్లు, కర్రలతో ఇంటిపైకి వెళ్లి దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో వైసిపి సానుభూతిపరులైన ఒకే కుటుంబానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. తలకు, చేతులకు, కాళ్లకు రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలో రంగప్రవేశం చేసి గాయపడిన వారిని అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా వున్నట్లు తెలిసింది. ప్రశాంతంగా వున్న గ్రామంలో ఒక్కసారిగా ఫ్యాక్షన్ పడగవిప్పడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పెద్దఎత్తున పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. డిఎస్‌పి చైతన్య, సిఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఖాజాహుసేన్ గ్రామంలోని బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

# ప్రభుత్వ సలహాదారునిగా ఆలూరు సాంబశివారెడ్డి

- క్యాబినెట్ హోదాతో పదవి - శింగనమలకు దక్కిన మరో పదవి



జిల్లా ఎమ్మెల్యేలతో సీఎంను కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి

**అనంతపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికిచెందిన వైసీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు(విద్య)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలూరు సాంబశివారెడ్డికి క్యాబినెట్ హోదా కల్పిస్తూ ఈ నియామకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం. శింగనమల నియోజకవర్గానికి మరో పదవి లభించినట్లైంది. ఆలూరు సాంబశివారెడ్డి స్వయానా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి భర్త అవుతారు. ఆలూరు సాంబశివారెడ్డిని ప్రభుత్వ సలహాదారునిగా నియమించడం పట్ల శింగనమల నియోజకవర్గంలో ముఖ్యంగా వైసిపి క్యాడర్‌లో హర్షం వ్యక్తం అవుతోంది. శింగనమల మండలం ఈస్ట్ నర్సాపురం గ్రామానికి చెందిన ఆలూరు సాంబశివారెడ్డి వైసీపీలో చురుగ్గా పనిచేశారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా గతంలో పనిచేశారు. టీడీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ఆలూరు సాంబశివారెడ్డి తనదైన శైలిలో స్పందించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రాథమిక విద్య పర్యవేక్షణ కమిటీ సీఈఓగా ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు. రాష్ట్ర ప్రాథమిక విద్య పర్యవేక్షణ కమిటీ సీఈఓగా ఇప్పటికే చురుకైన పాత్ర నిర్వహించారు. ఢిల్లీలో పాఠశాలల అభివృద్ధికి అక్కడ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించారు. ఇదే విధంగా మరికొన్ని రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అమలు చేస్తున్న విధానాలను ఆంధ్రలో అమలు చేసి విద్యా సంస్కరణల విషయంలో ఆలూరు సాంబశివారెడ్డి సలహాలు, సూచనలు ఇస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారులు (విద్య)గా క్యాబినెట్ హోదా కల్పిస్తూ ఆలూరు సాంబశివారెడ్డికి పదవి ఇవ్వడం ద్వారా విద్యా సంస్కరణల విషయంలో మరింత చురుగ్గా పనిచేస్తారని పరిశీలకులు భావిస్తున్నారు.

# నష్టపోయిన రైతులు చేనేతలను ఆదుకోవాలి

- రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలి
- చేనేతలకు నెలకు రూ.25వేలు ఇవ్వాలి
- మజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల డిమాండ్



మాట్లాడుతున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

**ధర్మవరం టౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

రెండు నెలలుగా కురుస్తున్న వర్ష బీభత్సానికి తీవ్రంగా నష్టపోయిన రైతులను, చేనేతలను ఆర్థికంగా ఆదుకోవాలని మజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల సూర్యనారాయణ డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన వలేకర్లతో మాట్లాడారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పంటలు చేతికి అందక తీవ్రంగా నష్టపోయారని ఆయన వాపోయారు. వేరుశనగపంట పొలంలోనే మొలకెత్తాయని, చాలా మంది రైతులు పెరికిన వేరుశనగ చెట్లు పొలంలోనే కుళ్ళిపోతున్న విషయం నాయకులు గుర్తించకపోవడం విడ్డూరమన్నారు. వరి, కంది, పత్తి మిగతాపంటలు కూడా చేతిక అందకపోడంతో రైతాంగం ఆవేదన చెందుతోందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తుచేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలతో పాటు సంవత్సరానికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలు పండని పరిస్థితి నెలకుని నష్టపోయిన పండ్లతోటల రైతులతో పాటు టమోటా రైతులను కూడా పరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పిఎం కిసాన్ పథకం కింద రూ.2వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.7,500లు మాత్రమే రైతులకు అందుతోందని ఆయన తెలిపారు. వర్షతీవ్రతకు మగ్గం గుంతల్లోకి నీరు రావడంతో చేనేత పరిశ్రమ కుదేలు అయ్యిందన్నారు. రెండు నెలలుగా మగ్గం పనులుసాగకపోవడంతో చేనేతలు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. చేనేతలను ఆదుకోవాలని ఆయన కోరుతూ ప్రతి నెలా రూ.25వేల పరిహారం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రెండు సంవత్సరాల పాటు కోలుకోలేని విధంగా నష్టం జరిగిందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు. రైతులను ఆదుకోని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని ఆయన వాపోయారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని, కనీసం గుంతలు పూడ్చే పరిస్థితికూడా లేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మాత్రమే రోడ్లు వేశారని, అవన్నీ తాము చేసినవేనని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తన హాయంలో నియోజకవర్గంలో 386 కిలోమీటర్ల తారు రోడ్లు వేశానని ఆయన గుర్తుచేశారు. తమ మీడియాలో మాత్రం అభివృద్ధిలో ముందున్నామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాగా స్థానిక ఎంఎల్ఎ మాత్రమే రూ.5 కోట్లనుండి రూ.500 కోట్లకు అభివృద్ధి చెందారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలను పట్టించుకోకపోతే పరుగెత్తించి కొడతారని ఆయన తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కల్పించుకుని రైతులు, చేనేతల పరిస్థితులపై సమీక్షించి తగిన విధంగా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అరవిందరెడ్డి, శ్రీనివాసులు, పామిశెట్టి శ్రీనివాసులు, డిష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పోలీసు అమర వీరుల వారోత్సవాలు విజయవంతం చేయండి

- 21 నుంచి 31వ తేది వరకు ఘనంగ నిర్వహించనున్న పోలీస్‌శాఖ



జిల్లా ఎస్పీ డా.పక్కీరప్ప కాగినెల్లి

**అనంతపురం క్రైం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

.ప్రతి ఏటా పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహజంచే పోలీసు అమర వీరుల వారోత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. అమర పోలీసులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ ఈ వారోత్సవాలను ఘనంగానిర్వహించేలా జిల్లా పోలీసు శాఖ సిద్దమైంది. జిల్లా ఎస్పీ డా.పక్కీరప్ప కాగినెల్లి పర్యవేక్షణలో ఆయా స్టేషన్ల పరిధుల్లో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారు. 1959 అక్టోబర్ 21వ తేది దేశ భద్రత కోసం 10మంది సిఆర్‌పిఎఫ్ జవాన్‌లు భారత్, చైనా సరిహద్దుల్లో ఉన్న లడ్ ఆక్సాయ్‌చిన్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. భారీ సంఖ్యలో చైనా సైనికులు భారత్ సరిహద్దుల్లోకి చొరబడి ఒక్కసారిగా మన సీఆర్‌పిఎఫ్ జవాన్‌లపై విరుచుకుపడ్డారు. సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ భారత్ జవాన్‌లు ఆత్మస్థైర్యంతో చైనా సైనికులను ఎదురిస్తూ, చివారి రక్తం బొట్టు వరకు పోరాడారు. దేశం కోసం అసువులు బాశారు. ఈ ఘన పురస్కరించుకుని ప్రతియేటా అక్టోబర్21న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**జిల్లా పోలీసు శాఖ ఆధ్వర ంయలోనిర్వహిస్తున్న కార్యక్రమాలు :**

ఈ నెల 21న అమరవీరుల సంస్మరణ దినం, పోలీసు అమరవీరులకు నివాళులు, శ్రద్ధాంజలి, 22 నుంచి 30 వరకు పోలీసు అమరుల గ్రామాల సందర్శన, అమరుల సేవలను వివరించడం, 24 నుంచి 27 వరకు మర్చా వేదికలు, వక్తృత్వపు పోటీలు, 26, 27 వరకు ఓపెన్ హౌస్‌లు నిర్వహణ తదితరాలు నిర్వహించనున్నారు.

**.ప్రదర్శనలో ఉంచే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు ఇవే..**

22 రైఫిల్, 410 మస్కెట్, 303 రైఫిల్, 762 ఎంఎం ఎస్ఎల్ఆర్, ఎకె 47, 5.56 ఎంఎం (ఇన్సాస్), 12 బోర్‌పంప్ యాక్షన్‌గన్, 9 ఎంఎం కార్బైన్, 380 రివాల్వర్, 9ఎంఎం పిస్టోల్, 9ఎంఎం గ్లాక్, వివిఎల్ పిస్టోల్, ప్రొజెక్టర్ ఫైరోటెక్, 12 బోర్ పంప్ యాక్షన్‌గన్, ఎల్ఎంజి, 51 ఎంఎం మోటారు, హెచ్ఇ 36 గ్రెనేడ్, తదితరాలను ప్రదర్శించనున్నారు.

**ఈ నెల 28 నుంచి 30 వరకు పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు :**

ఈ నెల 28 నుంచి 30 వరకు పోలీసు వాయిద్య బృందాలు ప్రదర్శనలునిర్వహించనున్నారు. పోలీసుల త్యాగాలు, పరాక్ర మాలు తెలియజేసే పాటలు ఆలపిం చను న్నారు. ఈ నెల 29వ తేదిన పోలీసుల త్యాగాలపై సెమినార్లు/ఉపన్యాసాలు, సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 30న పోలీసు అమరుల కుటుంబా ల్లోని ప్రత్యేక సాధకులకు సన్మాన కార్య క్రమం, ప్రశంసించనున్నారు. ఈ నెల 31న సమైఖ్యతా దినంగా ప్రకటించి పాటించ నున్నారు. దీంతో అమరవీరుల వారోత్సవాలు ముగియనున్నాయి.

